
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0
తణుకు : 33.0 - 27.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు

మంగళవారం 9 జూలై 2024



భీమవరం రూరల్ మండలం కరుకువాడ సమీపంలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

సీజనల్ డేంజర్

గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం
వర్షాలతో అంటువ్యాధుల భయం
గత టీడీపీ ప్రభుత్వ హయాంలో
రూ.21 కోట్లతో కంపోస్టు యార్డుల ఏర్పాటు
పక్కన పడేసిన వైసీపీ ప్రభుత్వం

భీమవరం రూరల్, జూలై 8 : గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. పంచాయతీలో నిర్మించిన కంపోస్టు యార్డులు లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. చెత్త సమస్యతో గ్రామాలను సీజనల్ వ్యాధుల బారిన పడేసేలా మారింది. ఎడతెరిపిలేని వర్షాలు పడుతుండటంతో చెత్త, నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో అంటు వ్యాధులు మొదలయ్యాయి. గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో పారిశుధ్యం మెరుగు పరిచేం దుకు కంపోస్టు యార్డులను ఏర్పాటు చేసింది. ఇప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలో 393 గ్రామాలకు 363 కంపోస్టు యార్డులు చెత్త స్టోరేజీ కోసం నిర్మించారు. వాటిలో చెత్త నుంచి సంపద ఏర్పాటు చేశారు. అప్పట్లో మేజర్ పంచాయతీ కంపోస్టు యార్డు నిర్మాణానికి రూ.7 లక్షల పైన, మైనర్ పంచాయతీకి రూ.5 లక్షల 50 వేలు నిధులు ఉపయోగించారు. కంపోస్టు యార్డుల కోసం సుమారు రూ.21 కోట్లు వెచ్చించారు. చాలా గ్రామాల్లో యుద్ధ ప్రాతిప దికన కంపోస్టు యార్డులు ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వాటిని ఉపయోగించకపోవడంతో పారిశుధ్యం చతికిలపడింది. గ్రామాల్లో రహదారుల పక్కన ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. చెత్త పేరుకుపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి.

మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలు

గ్రామాలలో కంపోస్టుయార్డుల ఏర్పాటుతో పాటు గత టీడీపీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌లో భాగంగా చెత్త సేకరణ బ్యాటరీ వాహనాలను అదుబాటులోకి తెచ్చింది. మైనర్ గ్రామాలకు ఒక వాహనం మేజర్ పంచాయతీలకు రెండు వాహనాలు ఇచ్చారు. వాటిని గత వైసీపీ ప్రభుత్వం మూల నపడేలా చేసింది. లక్షల రూపాయలు విలువైన వాహనాలు ఉపయోగానికి లేకుండా పాడయ్యాయి. ఇప్పుడు చెత్త సేక రణ చేసేందుకు వాహనాలు లేకుండాపోయాయి.

సీజనల్ వ్యాధుల విజృంభణ

వర్షాకాలం వస్తే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో వర్షాకాలంలో వ్యాధులతో మంచానపడ్డ వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీనంతటికి గ్రామాల్లో అపరిశుభ్రతే కారణమని వైద్యులు నిర్ధారిస్తూ వచ్చారు. అయినప్పటికి పారిశుధ్యం పైన, చెత్త నిర్మూలన మీద వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. భీమవరం మండలంలోని ఒక మేజర్ పంచాయతీలో గడిచిన రెండేళ్లలో వందల సంఖ్యలో విష జ్వరాలు ప్రబలాయి. జిల్లాలో చాలా గ్రామా ల్లో ప్రజలు అంటు వ్యాధులతో ఆసుపత్రి పాలయ్యారు. ఇప్పుడు కూడా గ్రామాల్లో అపరిశుభ్రం వల్ల వ్యాధులు మొదలయ్యాయి. దీంతో ప్రజలు చెత్తపైన దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



మూలకు చేరిన చెత్త సేకరణ వాహనం



నిరుపయోగంగా మారిన కంపోస్టు యార్డు

పక్క జిల్లాల నుంచి ఉచిత ఇసుక

త్వరలోనే అందుబాటులోకి రీచ్‌లు : కలెక్టర్



భీమవరం టౌన్, జూలై 8 : సాధ్యమైనంత త్వరగా జిల్లాలోని ఇసుక రీచ్‌లను వినియోగంలోకి తీసుకు రావటానికి ప్రయత్నిస్తున్నామని, అప్పటివరకు జిల్లా వాసులు సమీపంలోని కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలలోని ఇసుక నిల్వ కేంద్రాల నుంచి ఉచిత ఇసుక పొందవచ్చని జిల్లా కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ చెదలవాడ నాగరాణి సోమవారం తెలిపారు. 'తూర్పు గోదావరి జిల్లాలో మూడు ఇసుక కేంద్రాలు భీమవరం, నర్సాపురం పట్టణాలకు 50-60 కిలోమీటర్ల దూరంలో, జిల్లాలోని 5 మండలాలకు అతి సమీపంలో ఉన్నాయి. నిడదవోలు మండలం పందలపర్రు కేంద్రంలో 52,082 మెట్రిక్ టన్నులు, పెరవలి మండలం పెండ్యాల కేంద్రంలో 1,46,249 టన్నులు, ఉసులుమర్రులో 33,065 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. కోన సీమ జిల్లాలోని మూడు ఇసుక నిల్వ కేంద్రాలు 15-30 కి.మీ దూరంలో ఉండగా జిల్లాలోని ఐదు మండలాలకు అతి సమీపంలో ఉన్నాయి. రావులపాలెం మండ లంలోని రావులపాడు-1 కేంద్రంలో 34,171 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2 82,950 టన్నులు, కొత్తపేట కేంద్రంలో 25,879 మెట్రిక్ టన్నులు ఉంది. జిల్లాలోని ఆచంట, పెనుగొండ మండలాల్లోని ఆరు ఓపెన్ ఇసుక రీచ్‌లు పనిచేయడం లేదు. వీటికి వివిధ అనుమతులు పొందాలి. యలమంచిలి, నర్సాపురం ప్రాంతాలలో ఐదు డీ-సిల్టేషన్ పాయింట్లు ఉండగా, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాల్సి వుంది. జిల్లాలోని ఆరు ఇసుక కేంద్రాలలో ఎటువంటి నిల్వలు లేవు. రేవుల వద్ద వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు, ప్రయాణ ఖర్చులు, ప్రభుత్వం వారికి చెల్లించవలసిన సీనరేజ్, జీఎస్టీ తదితర ఖర్చులు మాత్రమే ఉంటాయి. మైన్స్ అండ్ జియాలజీ వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయి. వినియోగ దారులు ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలను చూపి ఇసుక పొందవచ్చు. వినియోగదారుడి నుంచి డిజిటల్ పేమెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుంది. ఒక వ్యక్తి ఒక రోజులో కేవలం 20 టన్నులు మాత్రమే తీసుకు వెళ్లడానికి అనుమతి ఇస్తాం. స్టాక్ పాయింట్లలో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఇసుక పొందడానికి అనుమతి ఉంటుంది. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వాహనాలలోకి లోడింగ్ చార్జీలు, ప్రభుత్వానికి చెల్లించవలసిన సీనరేజ్, తదితర ఖర్చులు చెల్లిస్తే సరిపోతుంది' అని కలెక్టర్ స్పష్టం చేశారు.

చెత్త బ్రాండ్‌లకు చెక్



నిల్వల వరకే పాత మద్యం
గతేడాది రూ. 1,418 కోట్ల అమ్మకాలు
కొత్త విధానం కోసం ఎదురుచూపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మద్యంలో చెత్త బ్రాండ్‌లకు చెక్ పడుతోంది. గత ప్రభుత్వంలో డంప్ చేసిన నిల్వలను మాత్రమే విక్రయి స్తున్నారు. పాత బ్రాండ్‌ల నిల్వలు అయిపోతే కొత్తగా ఆ కంపెనీ నుంచి సరఫరా చేయడం లేదు. ఫలితంగా చెత్త బ్రాండ్‌లకు చెక్ పడినట్టయింది. ఇకపై నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానుంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కొత్త విధానం అమలు చేయనుంది. అందుకోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గత ఏడాది రూ.1418 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. గత ప్రభుత్వంలో డిపోలకు పంపిన నిల్వలు ఇంకా మిగిలే ఉన్నాయి. ఒక ప్రణాళిక ప్రకారమే వైసీపీ ప్రభుత్వం భారీ నిల్వలు చేసింది. అస్మదీయ కంపెనీలకు మేలు చేకూర్చింది. ఇప్పటికీ అవే నిల్వలున్నాయి అయితే కొన్ని చెత్త బ్రాండ్‌ల నిల్వలు అయిపోయాయి. వాటిని మళ్లీ రప్పిం చడం లేదు. ప్రస్తుతం రాయల్ స్టాగ్, రాయల్ గ్రీన్ వంటి నాణ్యమైన రకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 5 శాతం అమ్మకాలు పెరిగాయి. వాస్తవానికి 15 శాతం మేర ప్రతి ఏటా పెరగాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో నాణ్యమైన రకాలకే ఆసక్తి చూపుతుంటారు. ఫలితంగా ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు వెళ్లే జిల్లా వాసులు అక్కడ నుంచి నాణ్యమైన బ్రాండ్‌లను తెచ్చుకుంటున్నారు. దాంతో ఆశించిన స్థాయిలో అమ్మకాలు పెరగలేదు. ప్రభుత్వ మద్యం షాపులు,బార్‌లలో ప్రతిరోజు సగటున రూ.3.90 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు సాగాయి. ఎన్నికల సమయంలో మద్యం అమ్మకాలు పెరిగాయి. అదే స్థాయిలో ఇప్పుడు కూడా విక్రయాలు నిర్వహిస్తున్నారు. బ్రాండెడ్ రకాలు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉంటున్నాయి.

ఉన్నతాధికారులు లేని శాఖ

మద్యం శాఖలో ఉన్నతాధికారులు లేరు. కమిషనర్‌లు, ఎండీలు బదిలీ అయ్యారు. కొత్త అధికారులు నియామకం తర్వాతే ప్రభుత్వం కొత్త మద్యం విధానం ప్రకటించనుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తారా లేదా ప్రైవేటు లైసెన్స్ దారులకు ఇస్తారా అనే విషయమై చర్చ సాగుతోంది. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్యం విక్రయాల్లో కల్లు గీత కార్మికులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చింది. మరోవైపు ప్రభుత్వ మద్యం అమ్మకాలు కూడా ఇప్పుడు సవ్యంగా సాగుతున్నాయి.దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేటు లైసెన్స్‌ల ద్వారా అమ్మకాలు సాగిస్తారన్న మరో వాదన వినిపిస్తోంది. మొత్తంపైన కొత్త పాలసీ వచ్చిన తర్వాతే మద్యం అమ్మకంపై ఒక స్పష్టత రానుంది. అంత లోగా చెత్త బ్రాండ్‌లకు చెక్ పడుతోంది. హైవాట్స్, పార్టీ స్పెషల్, రాయల్ సింహ, పార్టీ స్పెషల్ గోల్డ్, మెలిత్సా, గోల్డెన్ టచ్, బీబీ వంటి రకాలను నిలిపివేశారు. ఇంకా బూమ్ బూమ్ వంటి రకాలు నిల్వ ఉన్నాయి. వాటిని త్వరలో నిలిపివేయనున్నారు. కొత్త పాలసీ వస్తే నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానుంది. కొత్త పాలసీ కోసం ఇప్పుడంతా ఎదురు చూస్తున్నారు.

బ్రాండెడ్ రకాలైతేనే అమ్మకాలు

భీమవరం ప్రాంతంలో బ్రాండెండ్ రకాలైతేనే కొనుగోలు చేస్తుంటారు. ఒక దశలో పూర్తిగా బ్రాండెడ్ మద్యం నిలిచిపోయింది. దాంతో భీమవరంలో అమ్మకాలు కూడా పతనమయ్యాయి. రాయల్ స్టాగ్, మేన్సన్ హౌస్ వంటి రకాలపై ఆసక్తి చూపుతుంటారు. వాటిని నిలిపివేయడంతో భీమవరంలో అమ్మకాలు తగ్గు ముఖం పట్టాయి. ఆ తర్వాత మళ్లీ కొంతమేర సరఫరా చేశారు. డెల్టా ప్రాంతంలో అమ్మకాలు తగ్గిపోవడానికి నాసిరకం మద్యం కూడా ఒక కారణమైంది. మరోవైపు ఆక్వా రంగం దెబ్బతినడం. వరిసాగు సవ్యంగా సాగక పోవడంతో గత ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. ధరలు పెంచినా సరే ప్రభుత్వం అను కున్నట్టుగా ఆదాయం రాలేదు. మరోవైపు ప్రజల ఆరోగ్యంపై నాసిరకం మద్యం ప్రభావం చూపింది. తాజాగా నాసిరకానికి చెక్ పడుతోంది. నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానుంది.

టెట్ షెడ్యూల్‌లో మార్పులు

వచ్చే నెల 3 వరకు దరఖాస్తులకు అవకాశం
అక్టోబరు 3 నుంచి 20 వరకు పరీక్ష



భీమవరం ఎడ్యుకేషన్, జూలై 8 : టెట్ పరీక్షకు దర ఖాస్తు చేసుకునే అవకాశం ఈనెల 3వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఉంది. ఆ విధంగానే పరీక్ష ఫీజు చెల్లింపు వచ్చే నెల 3వ తేదీ వరకు చెల్లించవచ్చు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు సెప్టెంబరు 22వ తేదీన హాల్ టికెట్స్ ఆన్‌లైన్‌లో పొందవచ్చు. అక్టోబరు 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్ష జరుగుతుంది. రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు. ఫస్ట్ సెషన్ ఉదయం ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. రెండవ సెషన్ మధ్యాహ్నం 2:30 నిమిషాల నుంచి 5 గంటల వరకు నిర్వ హిస్తారు. వీటిలో పేపర్-1ఏ, పేపర్-1బి, పేపర్ -2ఏ, పేపర్- 2బి నిర్వహిస్తారు. పరీక్ష అయిన తరువాత అక్టోబరు 4వ తేదీన ఇనీషియల్ కీ విడుదల చేస్తారు. ఫైనల్ కీ అదే నెల 27వ తేదీన ఇస్తారు. నవంబరు 2వ తేదీన పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నారు. దరఖాస్తుకు, పరీక్ష రాయడానికి మూడు నెలల వ్యవధి ఉండటంతో అభ్యర్థులకు ప్రిపరేషన్‌కు ఎక్కువ సమయం ఇచ్చినట్లయ్యింది. దాంతో పాటు గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల హడావుడిలో ఇచ్చిన డీఎస్సీ నోటి ఫికేషన్‌లో టెట్ పరీక్షకు తక్కువ సమయమే ఉండడంతో చాలామంది అభ్యర్థులు ఉత్తీర్ణతలో వెనుకబడ్డారు. ఇది దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన మెగా డీఎస్సీలో టెట్ మరోసారి నిర్వహించడం అభ్యర్థులకు ఉపయోగకరంగా మారింది. డీఎస్సీ పరీక్ష సమయం కూడా ఎక్కువ ఉండే అవకాశం ఇస్తే లాంగ్ కోచింగ్ తీసుకునేలా అభ్యర్థులు అప్పుడే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఐదేళ్ల పాటు మూతపడిన కోచింగ్ సెంటర్లు మరలా తెరు చుకుంటున్నాయి.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 8 :ప్రజల సమస్యలను శ్రద్ధతో సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జేసీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి జిల్లా కేంద్రానికి వస్తుంటారని, వారి పట్ల తగినంత శ్రద్ధ చూపి వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. మొత్తం 179 అర్జీలు జిల్లా యంత్రాంగం స్వీకరించింది.

విన్నపాలు ఇలా..

- ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం, మహదేవపట్నం గ్రామాలకు సంబంధించిన 500 ఎకరాల ఆయకట్టు పరిధిలో మురుగు కాలువ గట్టు, రక్షేసు కోడును ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో నివాసాలు ఉంటున్న ప్రజలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించడం వల్ల మురుకు కాల్వ పూర్తిగా పూడుకు పోయింది. దీంతో పంట పొలాలు నీట మునిగి చాలా నష్టపోతున్నామని న్యాయం చేయాలని రైతులు పెదపాటి వెంకటేశ్వరరావు, బీహెచ్ హరినాథరాజు, కడలి శ్రీనివాస్, తదితరులు కోరారు.



బాధితుల గోడు వింటున్న కలెక్టర్ నాగమణి

- పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఏడాది నుంచి అధికారులు పట్టించుకోవడం లేదని, పింఛను మంజూరు చేయాలని పెనుగొండ మండలం వదలి గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ చలుమూరి పావని కోరారు.
- తన పేరున ఉన్న ఇంటి పన్ను తన ఇద్దరు కుమారుల పేరున మార్చమని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదని, తగిన పరిష్కారం చూపాలని వీరవాసరానికి చెందిన బొంతు పెద్దిరాజు కోరారు.
- తన భర్త చనిపోయి మూడు సంవత్సరాలు అయిందని, ఆధారం ఏమీ లేదని పింఛన్ మంజూరు చేయాలని భీమవరం మండలం తుందురు గ్రామం నుంచి పెన్నమరాజు శ్రీదేవి కోరారు.



చేపలు పట్టుబడి చేస్తున్న రైతులు

చేప రైతు పంట పండింది

కిలో శీలావతి ధర రూ.115

కలిదిండి, జూలై 8 : ఎట్టకేలకు తెల్ల చేపల ధర పెరగ డంతో ఆక్వా రైతులు ముమ్మరంగా చేపల పట్టుబడులు చేస్తున్నారు. కిలో శీలావతి ధర రూ.115 పలుకుతోంది. చాలాకాలంగా కిలో తెల్ల చేప ధర రూ.100 మాత్రమే ఉండడంతో చేపల రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోయారు. చేపల మేతలకు ఉపయోగించే డీవోబీ తవుడు పది టన్నులు రూ.2 లక్షల నుంచి రూ.1.75 లక్షలకు తగ్గింది. దీంతో చేపల రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. చే పలకు గిట్టుబాటు ధర లభించడంతో కిలో సైజు శీలావతి చేపలను అధికంగా పట్టుబడులు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర లేక ఆక్వా రైతులు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే చేపల ధరలు పెరగడం,డీవోబీ తవుడు ధర తగ్గడంతో చేపలకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



6,018 క్యూసెక్కుల జలాలు విడుదల

5

చెదిరిన కల

హైదరాబాద్‌లో ఉద్యోగం చూసుకుని భర్తతో పాటు అక్కడే పిల్లలతో కలిసి సంతోషంగా ఉండొచ్చన్న ఆమె ఆశలు అడియాశలయ్యాయి. ఏడాదికి రూ.15 లక్షల జీతంతో ఉద్యోగానికి ఎంపికైన ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆవిరైంది. కారు డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం.. ఆమెతోపాటు కుమారుడిని, తల్లిని బలి తీసుకుంది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి.

- రూ.15 లక్షల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి మహిళ ఎంపిక
- ఆనందంతో హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణం
- లక్ష్మీ నగర్ వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకొన్న కారు
- తల్లి, కుమారుడు సహా మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తు.. అతివేగమే ప్రమాదానికి కారణం



ద్వారకా తిరుమల, జూలై 8 : తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని నాగార్జున, భాగ్యశ్రీ దంపతులకు ఇద్దరు కుమారులు నాగ షణ్ముఖ్, నాగ నితిన్‌కుమార్ ఉన్నారు. నాగార్జున హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తూ అతను ఒక్కడే అక్కడ ఉంటున్నాడు. గ్రామంలోనే పిల్లలతో పాటు ఉంటున్న భాగ్యశ్రీ తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం వస్తే భర్త వద్దకు వెళ్లే ప్రయత్నాల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇంటర్వ్యూ నిమిత్తం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు ఇద్దరు కుమారులతో పాటు భీమవరానికి చెందిన ఆమె తల్లిదండ్రులు బొమ్మా నారాయణ రావు, కమలాదేవితో కలిసి వెళ్లారు. అక్కడ ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భాగ్యశ్రీ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణమైంది. భర్త నాగార్జున పనిపై అక్కడే ఆగిపోగా, వ్యక్తిగత పనిమీద తండ్రి నారాయణరావు విజయవాడలో కారు దిగిపోయారు. తర్వాత ఆయన ట్రైన్‌లో భీమవరం వెళ్లిపోయారు. మిగిలిన వారు రాజవోలు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న చెన్నై నుంచి కాకినాడకు వెళ్తున్న మిషనరీ లోడు ట్రాలీ లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టి ట్రాలీలోకి దూసుకుపోయింది. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. భాగ్యశ్రీ (27), నితిన్ కుమార్(4), కమలాదేవి (55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన డ్రైవర్ దుర్గావంశీ, చిన్నారి నాగషణ్ముఖలను స్థానికులు బయటకు తీసి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వంశీ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఎస్పీ మేరీ ప్రశాంతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భీమడోలు సీఐ బి.బి.రవికుమార్, పోలీసు సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఇద్దరు కుమారులు నితిన్, షణ్ముఖ్‌లతో తల్లిదండ్రులు నాగార్జున, భాగ్యశ్రీ (ఫైల్)





లక్ష్మీనగర్‌లో జరిగిన ప్రమాద దృశ్యాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఇన్‌సెట్‌లో కారులో మృతదేహాలు

ప్రమాదానికి కారణమేమిటి..

ఘటనా స్థలంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తే సరిగ్గా ఉదయం 5.42 గంటలకు వీరు ప్రయాణిస్తున్న ఎర్టికా కారు రోడ్డుపై మెలికలు తిరుగుతూ పక్కన ఆపి ఉంచిన కంటైనర్ లారీని అతివేగంతో ఢీకొట్టింది. డ్రైవర్ దుర్గావంశీ నిద్రమత్తు, అతివేగం లేక వేరే కారణం ఏమైనా ఉందా ? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కన కంటెయినర్‌ను ఆపడం వల్లే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

విషాదఛాయలు

భాగ్యశ్రీతోపాటు ఆమె కుమారుడు నితిన్, తల్లి కమలా దేవిల మృతితో రాజవోలు, భీమవరంలలో విషాదఛాయలు నెలకొన్నాయి. గుంటూరు జిల్లా భట్టిప్రోలుకు చెందిన నాగా ర్జునకు భీమవరానికి చెందిన భాగ్యశ్రీకి వివాహం కాగా, వీరి ఇద్దరి కుమారులతో కొన్నాళ్లుగా రాజవోలులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. భాగ్యశ్రీ తన భర్తకు చేదోడుగా ఉండి కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడే ఉద్యోగం చేయాలని నిర్ణయించి ఇంటర్వ్యూకి వెళ్లింది. ఏడాదికి రూ.15 లక్షలు ప్యాకేజీతో ఎంపికైంది. దీంతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా ఉన్నారు. ఆ ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆ ఇంట విషాదం అలుముకుంది. బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

పోస్టుమార్టం పూర్తి..

ఏలూరు క్రైం : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కమలాదేవి, భాగ్యశ్రీ, నితిన్‌కుమార్ మృతదేహాలకు భీమడోలు సీఐ రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ రాగిరి రాంబాబు శవ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు ఆదేశాలతో ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మృతదేహాలకు వైద్య నిపుణులచే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కూర్మావతారంలో శ్రీజగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 8: కూర్మావతారంగా శ్రీజగన్నాథస్వామి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. పురాతన ఆలయమైన, శ్రీవారి ప్రధానాలయానికి దత్తత దేవాలయమై విరాజిల్లుతున్న ఈ ఆలయంలో జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. ఇందులో భాగంగా కూర్మరూపంలో శంఖు, చక్రాలను ధరించి అభయ హస్తాన్ని ప్రసాదిస్తున్న అలంకారంలో ఉన్న జగన్నాథుని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు మరోసారి పొడిగింపు

గణపవరం, జూలై 8: ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నిధి మీనా పొడిగించినట్లు గణపవరం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. 10వ తరగతిలో మార్కుల ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

రాజధాని నిర్మాణానికి విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న మహిళలు

దెందులూరు, జూలై 8 : రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా పూర్తికావాలని ఆకాంక్షిస్తూ కొవ్వలి గ్రామ మహిళాలు తమ వంతు సాయంగా విరాళాలు సేకరిస్తున్నారు. కొవ్వలి టీడీపీ మహిళా విభాగం నాయకురాళ్లు ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ విరాళాలను ముఖ్యమంత్రికి అందజేస్తామని వారు తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ కార్డులు

ఏలూరు అర్బన్, జూలై 8 : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)లో జిల్లా నుంచి ఎంపికైన బాల,బాలికల మెరిట్ కార్డులను బీఎస్ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు డీఈవో అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మెరిట్ కార్డుని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థి పేరు, తల్లి లేదా తండ్రి పేరు సరిచూసుకుని జాతీయ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో ఆగస్టు 31లోగా దరఖాస్తును అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం, సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా దరఖాస్తును ధ్రువీకరింప చేసుకోవాలని సూచించారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు తదితర వివరాలన్నీ మెరిట్ కార్డులో ఉన్న విధంగానే అక్షరం తప్పు కూడా లేకుండా ఆధార్ కార్డులోను, బ్యాంకు పాస్‌బుక్‌లోనూ ఒకేలా ఉండాలన్నారు. వివరాలు సరిపోలని విద్యార్థులు సంబంధిత స్కూళ్ల హెచ్‌ఎంల ద్వారా ఏలూరు డీఈవో కార్యాలయానికి ధ్రువీకరణలతో సహా అందజేయాలని సూచించారు.

వర్జీనియా పొగాకుకు రికార్డు ధర

జంగారెడ్డిగూడెం, జూలై 8 : వర్జీనియా పొగాకు ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కిలో పొగాకు ధర సోమవారం రూ.376కు చేరి రికార్డు సృష్టించింది. జంగారెడ్డిగూడెంలో ఉన్న రెండు వేలం కేంద్రాల్లో ధరలు ఇదేవిధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పొగాకు ధరలు పెరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్విమ్మింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన స్విమ్మింగ్ క్రీడాకారులు

ఏలూరు రూరల్, జూలై 8: హైదరాబాద్‌లో ఈ నెల 5,6 తేదీల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా, బిశ్వనాథ్ భత్యా స్విమ్మింగ్ పూల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించారని కోచ్ బండ్ల గణేష్ తెలిపారు. హిమరియన్న బంగారు, ఎం.ధనుష్‌సాయి, ఎం.రిషిరామ్ బంగారు పతకాలు, ఎం.సంజయ్, టి.అవినాష్ వెండి, రజిత పతకాలు, టి.విష్ణువర్ధన్ రెండు వెండి పతకాలు, ఎం.రిజాయ్‌సన్ రజిత పతకం సాధించారని తెలిపారు. బటర్‌ఫ్లై, ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో స్విమ్మింగ్ పోటీలు జరిగాయని తెలిపారు. విజేతలను కోచ్ గణేష్ అభినందించారు.

ద్వారకా తిరుమలలో నిధుల దుర్వినియోగం

విచారణకు డిమాండ్.. జేసీకి వినతి



వివరాలు తెలుపుతున్న ఆముక్త

ఏలూరు రూరల్, జూలై 8: ద్వారకా తిరుమల గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ చేసి దుర్వినియోగమైన సొమ్మును పంచాయతీ కార్యదర్శి నుంచి రికవరీ చేయాలని, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన నిమ్మగడ్డ ఆముక్త, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ద్వారకాతిరుమల గ్రేడ్-1, పంచాయతీ సెక్రటరి, పంచాయతీలో నిధుల దుర్వినియోగం చేశాడన్నారు. పన్ను వసూలు సొమ్ము, అక్రమంగా లేఅవుట్ల అనుమతి, పారిశుధ్య కార్మికులు జీతాల్లో చేతివాటం ప్రదర్శించి సుమారు రూ. రెండు కోట్లకు పైనే నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇదే విషయంపై గతంలో జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ దృష్టికి తీసుకువెళితే విచారణకు ఆదేశించారని, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీవో విచారణ చేశారన్నారు. సమగ్ర నివేదిక డీపీవో వద్ద ఉందన్నారు. ప్రస్తుతం విచారణకు సంబంధించి ఫైల్స్ తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని, జేసీ దృష్టికి తీసుకువెళ్ళారు. పంచాయతీ కార్యదర్శి నుంచి దుర్వినియోగం సొమ్మును రికవరీ చేయాలని, విచారణ ఫైళ్ళు మాయం కాకుండా చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు.


చేతి సమస్యలపై ప్రత్యేక శిబిరం



కృత్రిమ అవయవాలను అందజేస్తున్న వైద్యులు భాస్కరానంద్, ఆషిష్

ద్వారకా తిరుమల, జూలై 8: స్థానిక విర్డ్ ఆసుపత్రిలో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్ నేతృత్వంలో సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఇందులో 40 మందిని పరీక్షించగా 10 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఈ క్యాంపు మంగళవారం కూడా ఉంటుందని, చేతి సమస్యలు, పోలియోతో బాధపడుతున్న వారు ఈ సేవలను సద్వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 85002 63149లో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ క్యాంపులో 12 మంది దివ్యాంగులకు కాలిపర్స్, నలుగురికి కృత్రిమ అవయవాలను అందించారు. వైద్యులు వి.ఆషిష్, భవ్యచంద్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అమలుకు పటిష్ట చర్యలు



నరసాపురం, జూలై 8 : ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, యలమంచిలి, చించినాడల్లో ఉన్న ఇసుక పాయింట్లలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు యుద్ధ ప్రాతిపదికన పొందాలన్నారు. కొత్తగా గోదావరిలో డీసిల్టింగ్ పాయింట్లను సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించాలన్నారు. జిల్లాలో ఇసుక పాయింట్లలో నిల్వలు, ఉచిత విధానం అమలుకు తీసుకోవల్సిన చర్యలను చర్చించారు. బోట్ మెన్ సొసైటీలు కొన్ని ఇబ్బందులను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గనులు, భూగర్భశాఖాధికారి జి.జయప్రసాద్, కన్జర్వేన్సీ సహాయ సంచాలకులు కేవీ సుబ్బారావు, వివిధ మండలాల తహసీల్దార్లు, బోట్స్‌మెన్ సొసైటీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు మెరవాలి

ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్ రెడ్డి



విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 8: సృజనాత్మక ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలు, ప్రాజక్టులతో విద్యార్థులు మెరవాలని, సంకల్పమే ఆయుధంగా, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఇన్‌స్పైర్ మనాక్ మెంటర్ షిప్'అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్ షాప్‌ను బొలిశెట్టి రాజేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశోధకుడిగా రాణించాలంటే పాఠశాల విద్య నుంచే బలమైన పునాది వేసుకోవాలన్నారు. బట్టీ పట్టే చదువులు మార్కులు తెచ్చిపెడతాయేగాని, మేధావులుగా గుర్తించలేవన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు గణితం, సైన్స్ ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రాజక్టు అసోసియేట్ డాక్టర్ సునీల్ భాస్కర్, ఎస్‌సీఈఆర్టీ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే సబ్జెక్టులపై పట్టు సాధించడంతో పాటు బహుముఖ నైపుణ్యాలను బాల్యం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి.శంకర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా హాజరైన విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ సుదర్శన దీప, డాక్టర్ వినోత్‌కుమార్ రాజా, డాక్టర్ భరణీధరన్, డాక్టర్ జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి నీటి మట్టం



స్పిల్వే వద్ద గోదావరి జలాల ఉధృతి

పోలవరం, జూలై 8 : పోలవరంలో గోదావరి నీటి మట్టం సోమవారం సాయంత్రానికి నిలకడగా ఉంది. స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడంతో స్పిల్వేలో సాధారణ నీటి మట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.550 మీటర్లు, దిగువన 16.570 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 26.590 మీటర్లు, దిగువన 15.470 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకట రమణ, మల్లికార్జునరావు తెలిపారు.

6,018 క్యూసెక్కుల జలాలు విడుదల



పట్టిసీమ ఎత్తిపోతల పథకం వరద నీటి పరవళ్లు

పోలవరం జూలై 8 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు సోమవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటి మట్టం 14.902 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో 1.8860 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

దూలం అరాచకాలపై ఫ్లెక్సీలు



కైకలూరు, జూలై 8: కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అక్రమాలు, అరాచకాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కలకలం రేపుతున్నాయి. పట్టణ ప్రధాన కూడళ్లలో నాలుగుచోట్ల జనసేన పార్టీ నేత కొల్లి వరప్రసాద్ (బాబి) భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైసీపీ చేసిన అరాచకాలను ఫ్లెక్సీలో జనసేన నాయకుడు ఏర్పాటు చేయడంతో కూడలిలో పెద్ద ఎత్తున ప్రజలు వాటిని తిలకిస్తున్నారు. ప్రచార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. సోమవారం వైఎస్ జయంతిని పురస్కరించుకుని కైకలూరు నీలం సంజీవరెడ్డి మార్కెట్‌లోని వైఎస్ విగ్రహానికి నివాళులర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు తరలివచ్చారు. సరిగ్గా విగ్రహం సమీపంలో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వైసీపీ శ్రేణులు సైతం ఈ ఫ్లెక్సీని ఆసక్తితో తిలకించారు. ఆయన అవినీతి, అక్రమాలపై ప్రస్తుతం ప్రజలకు తెలియజేస్తోంది మచ్చుకే అని, ఇంకా వారు చేసిన దౌర్జన్యాలు ప్రజల ముందుకు తీసుకువస్తానని కొల్లి వరప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ముగిసిన నాటిక పోటీలు



ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు రూరల్, జూలై 8: ఏలూరు వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరి షత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ముగిశాయి. నాటికలన్నీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. 'ఇంద్రప్రస్థం' నాటిక మొదటి బహుమతికి ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 'రాటా' నాటికను ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ. ఎనిమిది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఐదు వేలు, తృతీయ బహుమతి రూ. మూడు వేలు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సోమలింగేశ్వరరావు, ఇరదల ముద్దుకృష్ణ, జవ్వాజి మోహన్‌విటల్, మజ్జి సూర్యకాంతారావు, లంకా వెంకటేశ్వర్లు, పెదపాటి రామకృష్ణ, గుత్తా కౌసల్యేంద్రరావు హాజరయ్యారు.

కేంద్ర నిధులు దారి మళ్లింపు

గత ప్రభుత్వం తీరుపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విమర్శ



వీహెచ్‌పీ కార్యదర్శిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: రాష్ట్రంలో వివిధ శాఖల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులు దారి మళ్లించి గత ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని విచ్ఛిన్నం చేసిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి రాఘవలును సత్కరించి అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాజధాని, పంచాయతీలు, పోలవరం, ఆర్థిక సంఘ నిధులు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. సీఎం చంద్రబాబు గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజి, జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.36 లక్షల ఎరువులు, పురుగు మందులు సీజ్



శ్రీహరిపురంలో ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ బృందం ఆరుగొలనులోని విత్తన ప్రోసెసింగ్ యూనిట్‌ను సోమవారం సీజ్ చేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఎరువుల గోదాములు, విత్తనాల యూనిట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరుగొలను విత్తన ప్రోసెసింగ్ యూనిట్‌లో లెక్కలు సరిగా లేవని రూ.6.85 లక్షల విత్తనాల విక్రయాలు నిలుపుదల చేసినట్టు తనిఖీ బృంద నాయకుడు కె.మహరాజన్ (ఏడీఏ) వివరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారులు కృష్ణకాంత్, ఆర్‌ఎస్ ప్రసాద్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం సాయంత్రం ముదినేపల్లి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు జరిపారు. ముదినేపల్లి, శ్రీహరిపురంలోని దుకాణాలను విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, భీమిలిపట్నం ఏడీఏ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు చేసి, ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. తనిఖీ చేసిన రెండు దుకాణాల్లోనూ ఎరువులు, పురుగు మందుల నిల్వలకు సంబంధించి రికార్డులు సరిగ్గా లేనందున రూ.22.60 లక్షల విలువైన 186.51 టన్నుల ఎరువులు, రూ.5.97 లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. వాటి అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మండవల్లి ఏడీఏ వెంకటమణి, ఏవో షేక్ జరీనా, వీఏఏలు పవన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన మహిళ హత్య !



సత్యవతి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: ఇంటి నుంచి తాడేపల్లిగూడెం వచ్చిన మహిళ అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైన ఘటన ఆరుళ్లలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలివి. ఆరుగొలనుకు చెందిన జానపాముల సత్యవతి (45) ఈ నెల ఒకటో తేదీన బంగారం కొనేందుకు తాడేపల్లిగూడెం వచ్చింది. అయితే తిరిగి ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పట్టణంలో గాలించారు. ఆచూకీ దొరక్కపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయితే ఆరుళ్ల కాలువ గట్టులోని తుప్పల్లో మహిళ మృతదేహం కనిపించడంతో పోలీసులు ఆ మృతదేహం సత్యవతిదిగా గుర్తించారు. ఆమెను ఎవరో హత్యచేసి ఆ తుప్పల్లో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెదపాడు, జులై 8 : ప్రమాదవ శాత్తు బాత్‌రూంలో కాలుజారిపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటనలో పెదపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వసంతవాడ గ్రామం అమృత లింగపేటకు చెందిన సంబంగి చిన్నమ్మ (85) గత నెల ఆరో తేదీన బాత్‌రూంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయింది. చికిత్స నిమిత్తం తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో కుమారుడు సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి, నగదు చోరీ



చిందర వందరగా దుస్తులు

జంగారెడ్డిగూడెం, జూలై 8: తాడువాయికి చెందిన పసుమర్తి ఏడుకొండలు ఇంట్లో విలువైన బంగారం, వెండి వస్తువుల టతోపాటు నగదు చోరీకి గురైందని జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మంగయ్య తెలిపారు. ఈ నెల ఏడో తేదీ ఆదివారం రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరు బయట నిద్ర పోయారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూడగా ఇంటి వెనుక తలుపు గొళ్ళెం తీసి ఉండడం చూసి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్ లోపల ఉన్న బీరువా పగలగొట్టి అందులో ఉన్న తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు, అరకేజి వెండి వస్తువులు, కొంత నగదు దోచుకుపోయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

స్టాఫ్ నర్సుపై దాడికి ఖండన

ఏలూరు అర్బన్, జూలై 8 : తిరుపతి రుయా ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్సుపై సోమవారం రోగి బంధువులు దాడి చేయడాన్ని ఏపీ ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.దయామణి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉండికి చేరిన కేవీకే స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర

కేవీకేల్లో స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర

మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ జగన్నాథరాజు

ఉండి, జూలై 8: కృషి విజ్ఞాన కేంద్రాలు స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని అన్ని కేవీకేలు స్వర్ణోత్సవ జ్యోతి యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రానికి సోమవారం స్వర్ణోత్సవ జ్యోతి చేరుకుంది. కేవీకే హెడ్ డాక్టర్ మల్లికార్జునరావు అధ్యక్షతన వరి విత్తనోత్పత్తి ప్రకృతి వ్యవసాయం ప్రధానాంశంగా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జగన్నాథరాజు మాట్లాడుతూ 1974 మార్చి 21న పుదుచ్చేరిలో తొలి కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించారన్నారు. రెండు రోజులు ఇక్కడే స్వర్ణోత్సవ జ్యోతి ఉంటుందన్నారు. 9న వీరవాసరం మండల మత్స్యపురికి, 10న ఉండి నుంచి ఘంటశాల కేవీకేకు వెళ్తుందన్నారు. మాజీ అసోసియేట్ డైరక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ కె.సూర్యనారాయణ మాట్లాడుతూ ఉండి కేవీకే గతంలో చౌడు భూమిగా ఉండేదని దానిని సారవంతమైన భూమిగా మార్చినట్లు తెలిపారు. రైతులు ఇందుకూరి హరిబాబు, చల్లారావు, శ్రీనివాసరావు, తోట వెంకట నరసింహారావు, రవిరాజు, లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. శాస్త్రవేత్తలు కె.విజయ్‌కుమార్, డాక్టర్ ఎన్‌డీ బోరా మెసియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, రజిత పాల్గొన్నారు. ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, భీమవరం, వీరవాసరం తదితర గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందిస్తున్న పోలీస్ అధికారుల సంఘ నాయకులు

పోలీసులను తిరిగి పంపండి

ఎన్నికల బదిలీలపై డీజీపీకి వినతి

ఏలూరు క్రైం, జూలై 8 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన సివిల్ ఏఆర్ ఏపీఎస్పీకి చెందిన సీఐ, ఎస్ఐ, ఆర్ఎస్ఐలను తిరిగి వారి వారి జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం నాయకులతో కలిసి జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు సోమవారం రాత్రి రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. సార్వత్రిక ఎన్నికలు మే 13న జరిగిన నేపథ్యంలో ఫిబ్రవరిలోనే ఏలూరు రేంజ్ పరిధిలోని పలువురు అధికారులను వారు పనిచేస్తున్న జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ చేశారన్నారు. ఎన్నికల అనంతరం తిరిగి వారి జిల్లాలకే తిరిగి బదిలీలు జరుగుతాయని ఉన్నతాధికారులు తెలిపారని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి జూన్ ఆరుతో ముగిసిందన్నారు. అప్పటి నుంచి బదిలీ అయిన అధికారులు తమ జిల్లాకు వెళ్ళే నిమిత్తం బదిలీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలను పోలీసు అధికారుల సంఘ నాయకులు డీజీపీ దృష్టికి తీసుకువెళ్ళారు. వారం రోజుల్లోగా బదిలీలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ద్వారకాతిరుమలరావు హామీ ఇచ్చారని ఏలూరు జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు తెలిపారు.

నిబంధనల మేరకే సమస్యల పరిష్కారం



డీఎంహెచ్‌వోను కలిసిన సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, జూలై 8 : వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాల్సిందేనని, ఏవైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తానని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట హామీ ఇచ్చారు. ఏపీ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా శాఖ నాయకులు సోమవారం డీఎంహెచ్‌వోను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీ చేసే ఉత్తర్వులను జిల్లాలో నూరు శాతం అమలు చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తవచ్చు నన్నారు. సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు అప్పారావు, నాయకులు విజయవర్ధన్ బాబు, నాగరాజు, బేబీ, రవీంద్రబాబు, ఏడుకొండలు, విజయశ్యామల, విజయమేరీ పాల్గొన్నారు.

అక్రమ బదిలీలపై ఫిర్యాదు

జిల్లాలోని అర్బన్ పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బదిలీ చేశారని ఆరోపిస్తూ కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారిణికి ఫిర్యాదు చేసినట్టు చింతలపూడి యూపీ హెచ్‌సీ స్టాఫ్ నర్సు(మేల్) ఆర్.గంగాధర్ తెలిపారు.

జాబ్‌మేళాకు భారీ స్పందన



జాబ్ మేళాలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

ఉండి, జూలై 8: ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ జాబ్ మేళాకు వివిధ ఐటీఐలలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హాజరయ్యారని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు తెలిపారు. ఉండి మండలం ఎన్‌ఆర్‌పీ అగ్రహారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో సోమవారం అప్రెంటీస్ జాబ్ మేళా నిర్వహించారు. 11 కంపెనీలు హాజరయ్యాయి. 206 మంది ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు విచ్చేసినట్లు తెలిపారు. వీరిని మెరిట్ ప్రాతిపదికగా ఎంపిక చేస్తారన్నారు. ఇంటర్ ఒకేషనల్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళతో అసభ్యప్రవర్తన

ఆరు నెలల జైలు.. ఐదు వేల జరిమానా

చింతలపూడి, జూలై 8: ఒక మహిళతో అసభ్యప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో పెరుమాళ్ళ సువర్ణరాజు అనే వ్యక్తికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష, రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు సోమవారం తీర్పు చెప్పారు. వివరాలివి.. చింతలపూడి మండలానికి చెందిన ఒక మహిళ చింతలపూడిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో పనిచేస్తూ ఉంటుంది. 2022, మే 22న స్కూటీపై వస్తుండగా, తుమ్మగూడెం వద్ద స్కూటీ చెడిపోవడంతో అక్కడ ఆపి బస్సు ఎక్కుదామని చూస్తుండగా, అదే గ్రామానికి చెందిన సువర్ణరాజు మోటారు సైకిల్‌పై వస్తూ తాను లిఫ్ట్ ఇస్తానని ఎక్కించుకున్నాడు. రేచర్ల వద్ద బైక్ ఆపి పక్కన ఉన్న పామాయిల్ తోటలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించంతో ఆమె చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ పి.చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ ప్రవేశపెట్టగా వాదోపవాదాలు విన్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు, ముద్దాయికి పైవిధంగా తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పి.సామయ్య వ్యవహరించగా, సీఐ ఎం.సుధాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ కుటుంబరావు సాక్షులను ప్రవేశపెట్టగా కోర్టు కానిస్టేబుల్ భగవాన్ సహకరించారు.

మంత్రి నిమ్మలను కలిసిన 98 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు



పాలకొల్లు అర్బన్, జూలై 8: రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఆయన కార్యాలయంలో ఆదివారం రాత్రి 98 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు, ఎంటీఎస్ టీచర్లు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. రెండు ఏళ్ళుగా రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 3500 మంది కాంట్రాక్ట్, ఎంటీఎస్ టీచర్లను క్రమబద్ధీకరించాలని, పదవీ విరమణ అనంతరం కొంత మొత్తంగా పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి నిమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కలిసి మీ సమస్య త్వరలో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వై.సుబ్బారాయుడు, పలు జిల్లాల నుండి వచ్చిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

12న నరసాపురం మండల సమావేశం

నరసాపురం రూరల్; జూలై 8: ఈనెల 12న మండల పరిషత్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ వీరభద్రరావు తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ సోని అధ్యక్షత జరిగే ఈసమావేశంలో ఎమ్మెల్యే నాయకర్ పాల్గొంటారన్నారు.

గ్రామాల్లో శానిటేషన్

నరసాపురం రూరల్, జూలై 8: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి గ్రామంలో శానిటేషన్‌ను మెరుగుపర్చాలని ఈవోపీఆర్డీ శర్మ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రతి గ్రామంలోని రహదారుల వద్ద బ్లీచింగ్, సున్నం చల్లాలన్నారు. ఎక్కడ మురికినీరు నిల్వ లేకుండా సచివాలయ శానిటరీ సిబ్బంది చూడాలని ఆదేశించారు.

బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఈ అనిల్‌కుమారి

నరసాపురం రూరల్, జూలై 8: ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసిన ప్రతి దానికి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఈ అనిల్‌కుమారి ఆదేశించారు. సోమవారం పట్టణ, మండలంలోని పలు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, ఏఏ రకాల మందులు ఇస్తున్నారన్న దానిపై ఆరా తీశారు. నాణ్యమైన పురుగు మందుల్ని మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. రైతులు నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏవో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరించాలి



టౌన్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం క్రైమ్, జూలై 8 : ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణపై టౌన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్‌కు వినతిపత్రం, ఉన్నత అధికారులకు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రాలను ప్రయాణికుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు అందించారు. సభ్యులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్‌నాయుడు, సుంకర చంద్, నరహరిశెట్టి కృష్ణ, వైసూర్యచంద్ర మాట్లాడుతూ గ్రీన్ సిగ్నల్ కోసం వేచి చూస్తున్న రైల్వే ప్రయాణికులకు రెడ్ సిగ్నల్‌తో నిరుత్సాహపరచడం సబబు కాదని, నెలలు తరబడి మచిలీపట్నం - విశాఖ - భీమవరం - నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయడం దారుణమని, విశాఖ వెళ్ళే సామాన్య మధ్యతరగతి ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైల్వే ట్రాక్ పనులు వల్ల రైళ్ళు రద్దు చేసి కొన్ని మళ్లింపు చేశారని, దానికి అందరూ సమ్మతించారని, రైళ్ళ పునరుద్ధరణ త్వరగా చేయాలని వారు కోరారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ నరసాపురం - భీమవరం - గుంటూరు లింక్ ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, దానిని డెమో రైలు వేసి నిడదవోలు వరకే వేశారని, వాటిని కూడా మార్చాలని కోరారు.

12 నుంచి గరికపాటి ప్రవచనాలు

భీమవరం అర్బన్, జూలై 8 :ఈ నెల 12, 13, 14 తేదీల్లో పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని విశ్రాంత ప్రిన్సిపాల్ దాయన సురేష్ చంద్రాజీ తెలిపారు. ఆధ్యాత్మిక వేత్త, బోండా సుబ్బారావు వర్ధంతిని పురస్కరించుకుని భీమవరంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో గరికపాటి కార్యక్రమం జరుగుతుందన్నారు. శ్రవణ కుమారుడి కథ, రామాయణంలో అయోధ్య కాండ తదితర అంశాలపై ప్రవచనం ప్రతి రోజు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

డ్రెయిన్ నిర్మించాలని వినతి

భీమవరం అర్బన్, జూలై 8: పట్టణంలోని ఏడవ వార్డులో పీపీ రోడ్డు నుంచి మారుతీ నగర్ డ్రెయినేజీ వరకు డ్రెయిన్ నిర్మాణం చేయాలని సీపీఎం నాయకులు బొక్కా సత్యనారాయణ, ఎం. వైకుంఠరావు డిమాండ్ చేశారు. డ్రెయిన్ నిర్మాణం కోరతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనేక సంవత్సరాలుగా అధికారులు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

మంత్రి కొల్లును కలిసిన గంటా



భీమవరం అర్బన్, జూలై 8: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను కృష్ణబలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీడీపీ బీసీ సాధికారత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బీసీల అభివృద్ధికి, కృష్ణబలిజ సమస్యల పరిష్కారానికి కృషిచేయలని కోరారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించుకున్నారు.

టెలికం చార్జీలు తగ్గించాలని ధర్నా



భీమవరం అర్బన్, జూలై 8: కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రైవేటు టెలికం కంపెనీల మొబైల్ రిచార్జ్ ధరలు భారీగా పెంచి భారాన్ని మోపాయని వెంటనే ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం రిలయన్స్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేశారన్నారు.

రూ. 15 వేల పెన్షన్ ఇప్పించండి



దివ్యాంగురాలిని శిబిరం వద్దకు తీసుకువస్తున్న ఆమె అన్న కాంతారావు

పెంటపాడు, జూలై 8: దివ్యాంగురాలైన తన కుమార్తెకు రూ. 15 వేలు పెన్షన్ ఇప్పించాలంటూ బాతు సావిత్రి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిలను వేడుకున్నారు. కే.పెంటపాడులో జరిగిన వైద్యశిబిరానికి విచ్చేసిన వారిని ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన సావిత్రి కలిసి తన కుమార్తె లావమ్మ మంచానికే పరిమితమై ఉంటుందని, ఎక్కడికైనా వెళ్ళాలంటే ఎవరైనా ఎత్తుకునే తీసుకువెళ్ళాలని అయితే ప్రస్తుతం ఆమెకు రూ. 6 వేలు పెన్షన్ మాత్రమే వస్తోందని, రూ. 15 వేలు పెన్షన్ ఇప్పించాలని వేడుకోగా స్పందించిన బొలిశెట్టి సంబంధిత అధికారులకు పెన్షన్ పెంచేలా చూడాలని ఆదేశించారు









వాసవి కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే బొలిశెట్టి.. కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యే అంజిబాబు.. ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజును కలసిన డాక్టర్ గోపాలరాజు.. స్వర్ణాంధ్రలో ఎమ్మెల్యే నాయకర్‌కు స్వాగతం

పేద విద్యార్థులకు చేయూతనివ్వండి: బొలిశెట్టి



మంత్రి లోకేశ్‌ను కలసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలలో ప్రోత్సాహం అందించేందుకు వాసవి యాజమాన్యం సహకరించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ పాలకుల మాదిరి తనకు కమీషన్‌లు ఇవ్వాల్సిన అవసరం లేదని తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. పట్టణంలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వ నిధులతో పాటు దాతలు ముందుకు వస్తే సుందర స్టేడియం నిర్మిద్దామన్నారు. త్వరలోనే తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ జాతరకు సమాయత్తమవుతున్నామని జాతర వైభవంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నాకరరావు, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

డ్రెయినేజీ ఫండ్‌కు డాక్టర్ గోపాలరాజు వితరణ

కాళ్ల(ఉండి), జూలై 8: తాను రూపకల్పన చేసిన ఉండి నియోజకవర్గం డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహాయనిధికి మంచి స్పందన వస్తున్నదని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం కాళ్ల మండలం పెదఅమిరం ఎమ్మెల్యే కార్యాలయానికి భీమవరం ఆసుపత్రి ఎండి, ప్రముఖ వైద్యులు డా. గాదిరాజు గోపాలరాజు విచ్చేసి ఎమ్మెల్యే రఘురామను అభినందించారు. అనంతరం రూ.1.50లక్షలను అందించారు.

కొత్త ఆలోచనలతో యువత ముందుకెళ్లాలి

నరసాపురం, రూరల్ జూలై 8: నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే యువత ఆలోచనలు కొత్తతరంగా ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. ఉపాధి అవకాశాల కోసం కాకుండా పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఆలోచనలు ఉండాలని అన్నారు. మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన లోకల్ బడ్డీ అనే స్టార్ యాప్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఆలోచనలతో విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి త్రినాధ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని తీర్చిదిద్దాలి

భీమవరం టౌన్, జూలై 8 : భీమవరం ప్రభుత్వాసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) కోరారు. సోమవారం నాడు ఆయన కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా పలు అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వాసుపత్రిలో నార్మల్ ప్రసావాలు జరిగిలా చూడాలన్నారు. పేద మహిళలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే లక్షలాది రూపాయలు ఖర్చుఅవుతోందన్నారు. ప్రభుత్వాసుపత్రిని ఒకసారి తనిఖీ చేసి మెరుగైన సేవలు అందించేలాచూడాలన్నారు. ఆపరేషన్ లేకుండా సుఖ ప్రసావాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాజాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యను కలుసుకున్నారు. ఎల్‌వీఎన్‌పురంలో పంటకాల్వ గట్టును ఆక్రమించుకుని చెరువులు తవ్వారని, ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు కోళ్ళ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

లోకేశ్‌ను కలసిన ఆరిమిల్లి

తణుకు, జూలై 8: నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. సోమవారం ఉండవల్లిలోని మానవ వనరుల, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను కలసి సత్కరించారు. పలు సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరారు.

పుస్తకాల పంపిణీ



ఎంఈవో, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఆకివీడు, జూలై 8: విద్యార్థులు విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి అన్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా ఆర్థిక సహకారంతో ఈస్టుపాలెం ఎంపీపీ పాఠశాలలో 132మంది విద్యార్థులకు సోమవారం పుస్తకాలు అందజేశారు. గంధం ఉమా తన తల్లిదండ్రులైననరసింహం-జేబీ సరోజని పేరు మీద ఈ పుస్తకాలు అందించారు. అనంతరం ఎంఈవో సీతారామయ్య, టీచర్స్ వర్ధిని, రమాదేవిలను సన్మానించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆకివీడు, జూలై 8:పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని పీహెచ్‌సీ ఏఎన్ఎం కల్పన అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సోమవారం అజ్జమూరు పాఠశాలలో విద్యార్థులకు అంటు వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి మాట్లాడారు. నిల్వనీరు ఉండరాదన్నారు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రమ్, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

ఆకివీడు, జూలై 8: పెదకాపవరంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి కెల్లా భార్గవిసత్య తెలిపారు. ఈ శిబిరంలో గర్భకోశ, లేగ దూడల్లో నట్టల నివారణ, గోమార్ల చికిత్స, గొంతువాపు, ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకాలు, కుక్కలకు రేబీస్ టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



అరుణాచలం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూలై 8: భీమవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం ప్రత్యేక స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ పీఎన్‌వీఎం సత్యనారయణ మూర్తి తెలిపారు. సోమవారం డిపోలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 19 నుంచి నాలుగు నెలలపాటు స్పెషల్ సర్వీసులు నడపబడుతున్నాయని, ఐదు పుణ్య క్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఈయాత్రలో ఉన్నాయని తెలిపారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, అరుణాచలం, శ్రీపురం, కంచి ఉంటాయని తెలిపారు. రిజర్వేషన్ కోసం 9666089036, 9866581333నెంబర్ల లకు సంప్రదించవచ్చనని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, ఐవీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీఎస్ఆర్ అంజనేయులు, జీవీఆర్ రావు, రాజబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లోకేశ్వరబాబు



గణపవరం, జూలై 8: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా గుమ్ములూరి లోకేశ్వరబాబు నియమితులయ్యారు. కోమర్రుకు చెందిన గుమ్ములూరి లోకేశ్వరబాబు విజయవాడలో జరిగిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు వర్ధనపల్లి కాశీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నట్లు సోమవారం ఆయన తెలిపారు.

గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం



పోడూరు, జూలై 8: ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలో సుమారు 65వేల ఎకరాలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న చించినాడ కాల్వలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగిపోయి నీటిపారుదలకు ఆటంకం కల్గిస్తున్నది. దీంతో రైతులు ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి, ఎమ్మెల్యే ఆదేశాలతో సోమవారం పెనుమదం సర్పంచ్ తానేటి బాబూరావు, మాజీ ఎంపీపీ పెన్మెత్స రామభద్రరాజు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్ గుర్రపుడెక్క తొలగింపు పనులకు ఎక్స్‌కవేటర్‌కు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు.

జిన్నూరు ఎల్ఐసీ రాము మృతి



పోడూరు, జూలై 8: జిన్నూరు గ్రామానికి చెందిన సీనియర్ ఎల్ఐసీ ఏజెంట్, సొసైటీ మాజీ చైర్మన్ పెన్మెత్స రామకృష్ణంరాజు (ఎల్ఐసీ రాము), (75) సోమవారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పాలకొల్లు ఎల్ఐసీ బ్రాంచ్ పరిధిలో 40ఏళ్లగా ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఒక కుమార్తె ఉన్నారు. సొసైటీ చెర్మన్‌గా పనిచేసి రైతులకు విశిష్ట సేవలందించారు. ఎల్ఐసీ రాము మృతిపట్ల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సర్పంచ్ జమ్ము మహాలక్ష్మి, సొసైటీ మాజీ అధ్యక్షుడు బాబు, పాలకొల్లు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రఘుకుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు

భీమవరం టౌన్, జూలై 8 : పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే దిశగా జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటుకు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాట్లాడుతూ పది మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాల యంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు, సురక్షిత మైన పని వాతావరణాన్ని నిర్ధా రించడానికి ఈ కమిటీ బాధ్యత వహిస్తుంద న్నారు.

మంచినీటి సమస్య వస్తే ఫిర్యాదు చెయ్యండి

భీమవరం టౌన్, జూలై 8 : పట్టణంలోని ఏ వార్డులోనైనా మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, మురుగునీరు వస్తున్నట్లుగా ప్రజలు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల సూచించారు. పట్టణంలోని 36,37 వార్డులకు సంబంధించి మంచినీటి సమస్యలపై ఫిర్యాదు రావటంతో మురుగునీరు రావటానికి గల కారణాలను గుర్తించి దానికి పైప్‌లీక్‌ను కనుక్కుని దాని మరమ్మతు పనులు చేపట్టారు.

21 నుంచి సీపీఎం జిల్లా సమావేశాలు


తణుకు, జూలై 8: తణుకులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే సీపీఎం జిల్లా సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశాల్లో ప్రజా సమస్యలు చర్చిస్తామన్నారు.

వీల్ చైర్ అందజేత

తణుకు, జూలై 8: సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేశారు. అమెరికా సంస్థ అయిన డాక్టర్ కేవీ రావు ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో అత్తిలి మండలం దంతుపల్లి గ్రామస్థుడు జుత్తిగ రంగారావుకు రూ. 6 వేల విలువైన వీల్‌చైర్‌ను అందజేశారు.

పట్టపగలే దోమల విజృంభణ

జాడలేని ఫాగింగ్



ఫాగింగ్ యంత్రం

అత్తిలి, జూలై 8 : పల్లెల్లో పట్టపగలే దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అయినా దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రధానంగా వీటి నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలను సరిగా ఉపయోగించడం లేదు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉండగా పది మేజర్ గ్రామ పంచాయతీలు, 8 మైనర్ పంచాయతీలు ఉన్నాయి. అధిక శాతం వాటిలో దోమల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. మండలంలోని వివిధ గ్రామాల్లోని కాలువలు పూడికతో నిండిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. లక్షలు వెచ్చించి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసి పంచాయతీలకు కేటాయించారు. ఒక్కో మిషను రూ.25 వేల నుంచి 45 వేల వరకూ కొనుగోలు చేసి పంచాయతీలకు కేటాయించారు. వాస్తవానికి ఇవి చాలవు. కనీసం ఉన్నవి వాడడం లేదు. వీటి ద్వారా పొగ పెట్టగలిగితే వేలాది మందిని దోమల బారి నుంచి రక్షించిన వారవుతారు. వివిధ కారణాలు చూపి ఫాగింగ్ మిషన్లు కొన్ని పంచాయతీల్లో పక్కన పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఘనంగా వైఎస్ జయంతి వేడుకలు



ఉండిలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

పాలకొల్లుఅర్బన్, జూలై 8: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. నియోజక వర్గ ఇన్‌చార్జి కొలుకులూరి అర్జునరావు, బోణం వెంకట్రావు, వి.కాసు, ఎం.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కాంగ్రెసు పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారామ్ అన్నారు. రాజశేఖర్ రెడ్డి జయంతిని పట్టణ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జంపన సుబ్రహ్మణ్యంరాజు, నాగకేశవ్ బాబు, బోణం రవికుమార్, రామరాజు, పాల్గొన్నారు.

ఉండి: ఉండిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి నిర్వహించారు. ఎంపీపీ ఇందుకూరి హరినారాయణరాజు, సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జి, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, గుళిపల్లి అచ్చారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పీవీఆర్‌కె ఆంజనేయరాజు, గలావిల్లి ధనుంజయులు, కొరపాటి అనిత, బందెల ప్రమీలా, కరిమెరక శివనాగరాజు, ఏడిద వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో నిలిచే ఉంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి పేర్కొన్నారు. వైఎస్ జయంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు బాల, ఎస్. అప్పారావు, పాలూరు శ్రీనివాస్, పజ్జూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ ఆలయానికి బంగారం అందజేత



ఉండి, జూలై 8: ఉప్పులూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు యర్రా కేశవరావు (చిట్టిబాబు) సుజాత దంపతుల కుమార్తె డా.సాయిమేఘన భీమవరంలోని మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయానికి కాసు బంగారాన్ని కానుకగా అందించింది. ఈసందర్భంగా ఆలయ అర్చకులు కోప్పేశ్వరరావు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

బాల్య వివాహాలు నిరోధించాలి: కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 8 : జిల్లాలో బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీలులేదని, బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో మాత్రమే ఉంచాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖలో అమలు జరుగుచున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల కార్మికులు కూడా ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బొలిశెట్టి, వలవల

పెంటపాడు, జూలై 8: ప్రజలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. కె.పెంటపాడు పెంట్లమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్ తోట గోపి, టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంధం సతీష్ ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. తొలుత పెంట్లమ్మ వారిని, భైరాగిమఠం గోపాలస్వామిని దర్శించుకున్నారు. బొలిశెట్టి రాజేష్, చైతన్య ఆసుపత్రి ఇన్‌చార్జి సోమేశ్వరరావు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పంతం శేఖర్, సర్పంచ్ పీతల సత్యనారాయణ, వర్ధనపల్లి కాశి, నరాలశెట్టి సంతోష్, మట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అభినందనీయం

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 8: ఉచిత ఇసుక విధానం అభినందనీయమని టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక వల్ల ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుకను దోచేశారన్నారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, వాడపల్లి సుబ్బరాజు, దాట్ల జగన్నాథరాజు, ఎరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురానికి రంగులు వేసేందుకు అనుమతి



పెనుమంట్ర, జూలై 8 : నత్తారామేశ్వరంలోని రామేశ్వర స్వామి దేవస్థానం రాజగోపురానికి రంగులు వేసేందుకు అనుమతి ఇవ్వాలని గ్రామస్థుడు తాతకుంట యల్లారీశ్వరావు దేవస్థానాన్ని కోరారు. తన సొంత డబ్బు రూ.9 లక్షలతో రంగులు వేయిస్తానని దాత తెలిపారు. దీనికి దేవదాయ శాఖ అధికారులు అనుమతిస్తూ పత్రాన్ని అందించారు.

ఎస్‌కేఎస్డీ కళాశాలకు నాక్ బి++



ప్రిన్సిపాల్ రామకృష్ణకు సర్టిఫికెట్ అందిస్తున్న సభ్యులు

తణుకు, జూలై 8: ఎస్‌కేఎస్డీ మహిళా కళాశాలకు నాక్ బి++ గ్రేడ్ లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా కల్గిన నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ మండలి రెండు రోజులు పర్యటించిందన్నారు. కమిటీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ మహేశ్‌చంద్ర, శ్రీవాస్తవ, అవదేశ్ ప్రతాప్ సింగ్, సభ్యులు ప్రొఫెసర్ గౌతమ్ బౌమిక్, ప్రొఫెసర్ పి. నిలేష్ బృందం కళాశాలలో అన్ని విభాగాలను పరిశీలించారన్నారు. పట్టణ ప్రముఖులతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారన్నారు. అలాగే తల్లిదండ్రుల, పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారని అనంతరం కళాశాలకు బి++ గ్రేడ్ అందించినట్టు కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి తెలిపారు.

సమష్టి కృషితోనే డెంగీ నివారణ

గణపవరం, జూలై 8: డెంగీ నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు కోరారు. గణపవరంలో సోమవారం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని కోరారు. ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి, ఎంపీహెచ్‌ఓ విల్సనబాబు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ రత్నమాణిక్యం మృతి



ఆకివీడు, జూలై 8: గుమ్ములూరు మాజీ సర్పంచ్ కోపల్లె రత్నమాణిక్యం (49) సోమవారం మరణించారు. హైదరాబాద్‌లో కూతురు దగ్గరకు శనివారం రత్నమాణిక్యం వెళ్ళారు. ఒక్కసారిగా గుండెల్లో నొప్పి వచ్చి కుప్పకూలిపోయారు. వైద్యుడు దగ్గరకు తీసుకెళ్ళగా మృతి చెందినట్లు తెలిపారు. ఈమె భర్త కోపల్లె సాయి కూడా గుమ్ములూరు మాజీ సర్పంచ్, ప్రస్తుతానికి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. హైదరాబాద్ నుంచి మృతుదేహం మంగళవారం గుమ్ములూరు చేరుకుంటుంది.

రంగ స్థల కళాకారుడు షేక్ బాజీశ్రీ మృతి

పాలకొల్లు అర్బన్, జూలై 8 : పట్టణానికి చెందిన రంగస్థల, సినీ, బుల్లి తెర నటుడు, వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత ఉద్యోగి షేక్ బాజీ మోహన్ (బాజీశ్రీ) (85) సోమవారం మధ్యాహ్నం 22వ వార్డులోని ఆయన నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాజీశ్రీ మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.